ఈనాడు
పార్వతీపురం మన్యం

శనివారం అక్టోబరు 5, 2024

ఇన్నాళ్లూ కొండలపై రహదారుల నిర్మాణానికి నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించడమే తప్ప పైసా విదల్చలేదు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎం జన్‌మన్ పథకంలో వెనుకబడిన సవర, గదబ తెగలు నివసిస్తున్న, గిరిజన గ్రామాలకు దారి చూపించాయి.

– న్యూస్‌టుడే, పార్వతీపురం

దారి చూపిన.. జన్‌మన్




ఇది కొమరాడ మండలం అర్తాం-గుణానుపురం రహదారి నుంచి సీతామాంబపురానికి వెళ్లే మార్గం. పూర్తిగా రాళ్లు తేలిపోయింది. పీఎం జన్‌మన్‌లో నిధులు కేటాయించడంతో త్వరలో మోక్షం కలగనుంది.

- పీవీటీజీ గ్రామాలకు 21 రహదారులు
- రూ.55.83 కోట్లు మంజూరు

జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో 21 గ్రామాలకు, సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న శ్రీకాకుళం జిల్లాలోని పలాస, పాతపట్నం, మెళియాపుట్టి, మందస మండలాల్లో ఆరు రహదారులకు నిధులు వచ్చాయి. కేంద్రం 60 శాతం.. రాష్ట్రం 40 శాతం నిధులు భరించి రహదారులు వేయనున్నాయి.

ప్రధానంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, మక్కువ మండలాల్లో 15 రహదారులకు మోక్షం కలుగుతుంది. కురుపాం మండలంలో కొండలపై ఉన్న మార్గాలకు ప్రాధాన్యం లభించింది. విజయనగరం జిల్లాలోని మెంటాడ, వేపాడ, శృంగవరపుకోట మండలాల్లో మూడు రోడ్లు వేయనున్నారు. ఇందులో శృంగవరపుకోట మండలంలో 10.40 కి.మీ. పొడవున్న ఒకే దారికి నిధులు మంజూరు చేయడం విశేషం.



కురుపాం మండలం తిత్తిరి - గూనగూడ రోడ్డు ఇది. దీనిపై నడక నరకప్రాయం. ఇన్నాళ్లు ప్రతిపాదనలే తప్ప మంజూరు లేదు. ఇప్పుడు నిధులు వచ్చాయి.

ఏ మార్గానికి ఎంత కేటాయించారు?

మండలం	ఎక్కడి నుంచి ఎక్కడికి	నిధులు (రూ.లక్షల్లో)	నిర్వహణకు (రూ.లక్షల్లో)
గుమ్మలక్ష్మీపురం	తోబన - మండగూడ	79.00	5.93
"	పి.ఆమిటి - కె.పాలవలస	47.00	8.78
జియ్యమ్మవలస	జియ్యమ్మవలస-పసుపువానివలస	165.00	12.38
కొమరాడ	అర్తాం రోడ్డు-సీతమాంబపురం	59.97	4.27
కురుపాం	గుజ్జువాయి - డేరింగుపాడు	284.00	21.30
"	జుంబిరి - కేదారిలంక	159.50	11.90
"	తిత్తిరి రోడ్డు-గాలిమానుగూడ	281.00	21.07
"	తిత్తిరి రోడ్డు- పులిపుట్టు	127.00	9.53
"	తిత్తిరి - గూనుగూడ	169.00	12.67
"	తిత్తిరి - ఎగువపులిపుట్టి	446.00	33.45
"	నాయుడుగూడ- సంధిగూడ	402.00	30.15
"	రాముడుగూడ-బొడ్డుగాడిగూడ	295.00	22.13
"	సంధిగూడ - సాలిడంగు	222.00	16.65
"	పులిపుట్టి - గుమ్మిడిగూడ	250.00	18.74
మక్కువ	చెముడు - సీహెచ్ పాలికవలస	240.00	6.60
మెంటాడ	కె.లింగాలవలస-గాజులగుడ్డివలస	235.00	7.94
ఎస్‌కోట	వీఏపీ రోడ్డు-గునపాడు	1130.00	35.00
వేపాడ	కె.ఆర్.పురం-గడబవలస	265.00	10.40
సీతంపేట	రోలుగుడ్డి జం.-కోడిపిల్లగూడ	154.00	11.50
"	తుంబకొండ - సంధిగూడ	144.00	10.80
"	పూతికవలస- మూడగూడ	85.00	6.38

నిర్వహణకూ పైసలు: ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 54.25 కిలోమీటర్ల పొడవున రహదారులు వేయడానికి రూ. 55.83 కోట్లు వెచ్చించడంతో పాటు ఐదేళ్ల నిర్వహణకు రూ.54.25 లక్షల నిధులు ఇచ్చారు. ఒక పార్వతీపురం మన్యం జిల్లాలో రహదారులకు రూ.52,03,42,000 మంజూరు చేశారు. ఇందులో కేంద్ర వాటా రూ. 2996.38 లక్షలు కాగా.. రాష్ట్ర వాటా రూ.2207.09 లక్షలు.

9న సామూహిక అక్షరాభ్యాసాలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో ఈనెల 9న మూలా నక్షత్రం సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, జి.శ్రీనివాసరావు తెలిపారు. 3 వేల మంది చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు రానున్నట్లు చెప్పారు. భక్తులకు ఉదయం ఫలహారం, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

స్వర్ణకాంతుల కోటదుర్గ

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కోటదుర్గమ్మ స్వర్ణకాంతులతో దర్శనమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, పాలకొండ



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఊపిరి తీసిన అతిసారం

★ ఇద్దరు మృతి, 35 మందికి లక్షణాలు





లెంక బంగారమ్మ, పడాల సీతన్న (పాతచిత్రాలు)



పడకలు లేక కూర్చోబెట్టి సెలైన్ ఎక్కించాల్సిన పరిస్థితి

అతిసారం ఇద్దరి ప్రాణాలు తీయగా.. మరో 35 మందిలో వ్యాధి లక్షణాలు బయటపడటంతో ఆ గ్రామం ఉలిక్కిపడింది. మృతులు లెంక బంగారమ్మ, పడాల సీతన్న. కొందరు సాలూరు, మరికొందరు విజయనగరం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటన పాచిపెంట మండలం విశ్వనాథపురంలో చోటుచేసుకుంది.

–న్యూస్‌టుడే, పాచిపెంట, సాలూరు గ్రామీణం

మన్యంలో వైద్యానికి పెద్దపీట

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. రాష్ట్రంలో 40 ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు మంజూరైతే మన్యం జిల్లాకే 8 వచ్చాయని, సాలూరు మండలంలో 4 ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం సాలూరు మండలం పెదపదం పంచాయతీ కేంద్రంలో రూ.55 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య కేంద్ర భవనానికి శంకుస్థాపన చేశారు. బాగువలస పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలు వెలికితీస్తామని చెప్పారు. అనంతరం ఉన్నతి పథకం కింద మహిళా సంఘానికి మంజూరైన రూ.15 లక్షల చెక్కును సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, తెదేపా పట్టణ, మండలాధ్యక్షులు చిట్టి, పరమేశు, వేణు, ఎంపీటీసీ సభ్యులు ఎ.రమాదేవి, శ్యామ్, సాయి పాల్గొన్నారు.



మహిళా సంఘం సభ్యులకు చెక్కు అందజేస్తున్న సంధ్యారాణి, భంజ్‌దేవ్

సాలూరుకు రైలొచ్చింది

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాలూరు పట్టణ ప్రజల రైలు ఆశలు ఎట్టకేలకు నెరవేరాయి. శుక్రవారం విశాఖ నుంచి సాలూరుకు నిర్వహించిన ట్రైల్ రన్ విజయవంతమైంది. బొబ్బిలి మీదుగా సాలూరు స్టేషన్‌కు చేరుకుంది. మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, పట్టణానికి చెందిన పలువురు స్వాగతం పలికారు.

బ్రిటీష్ కాలం నుంచి సాలూరులో రైల్వేస్టేషన్ ఉంది. తొలుత బొగ్గు ఇంజిన్ రైలు ఎక్కువ కాలం నడిచింది. 2018లో ఇక్కడ స్టేషన్‌లో విద్యుత్తు లైను వేశారు. 1998 నుంచి 2020 వరకూ డీజిల్ ఇంజిన్‌తో బొబ్బిలి వరకు రైలు బస్సు నడిచింది. 2020లో కరోనా నుంచి రాకపోకలు నిలిపేశారు. తర్వాత సాలూరు నుంచి విశాఖకు రైలు వేయాలని ఎప్పటి నుంచో పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు కోరుతూ వచ్చారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చొరవ, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సహకారంతో ఎట్టకేలకు కల నెరవేరింది. మరో 15 రోజుల్లో విశాఖ నుంచి సాలూరుకు పూర్తిస్థాయిలో రైలు నడవనుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.



రైలును ఆసక్తిగా చూస్తున్న పట్టణ ప్రజలు



వేంకటేశ్వరునికి పూజలు


ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ చేపట్టారు. ఉదయం గరుడ పటాన్ని ధ్వజ స్తంభంపై ఎగురవేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించారు. ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

– న్యూస్‌టుడే, నెల్లిమర్ల

దిల్లీకి వెళ్లారు.. ఇన్‌స్పైర్ చేశారు

అరటి దవ్వలతో బ్యాగులు..

ఎల్.కోట మండలం జమ్మాదేవిపేట సమీపంలోని జ్యోతిబాపులే వెనుకబడిన తరగతుల బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పూజిత అరటిదవ్వలను ఉపయోగించి జియో బ్యాగుల తయారీకి ముందడుగు వేసింది. గైడ్ ఉపాధ్యాయురాలు ఇంద్రజ సహకారంతో రూపొందించింది. దీనికి పెద్దగా ఖర్చు ఉండదు. అరటిగెల పండిన తరువాత చెట్టు కొట్టేస్తారు. దాని లోని పిలకను తీసుకుని దానిని ముక్కలుగా కోసి, గ్రైండర్‌లో ఆడించాలి. ఆ ముద్దను పాడిదుస్తులపై ఎండలో ఆరబెట్టి, అనంతరం బ్యాగులను తయారు చేస్తోంది. ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడే ఈ ఆలోచన వచ్చిందని, ప్రిన్సిపల్ యూవీకే.పాత్రో, ఉపాధ్యాయురాలు ఇంద్రజ ప్రోత్సాహంతో ముందుకెళ్తున్నట్లు బాలిక చెబుతోంది. ఇప్పటికే టోక్యోలో అంతర్జాతీయ ప్రదర్శనకు తన ప్రాజెక్టు ఎంపికైందని, ఇటీవల దిల్లీలో జరిగిన జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో సైతం పాల్గొన్నట్లు పేర్కొంది.



జియో బ్యాగులు



గైడ్ ఉపాధ్యాయిని ఇంద్రజతో పూజిత

పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ ఓ విద్యార్థిని తయారు చేసిన వస్తువులు ఆలోచింపజేయగా.. వివిధ రకాల పనులు చేసేలా ఓ పరికరాన్ని రూపొందించి ఔరా అనిపించింది మరో బాలిక. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ముందుకెళ్తూ, పలు ప్రాంతాల్లో జరిగిన ప్రదర్శనల్లో సత్తా చాటుతూ చివరకు దిల్లీ చేరుకున్నారు. ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో తాము తయారు చేసిన వాటిని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అవేంటో మీరూ చూసేయండి..

– న్యూస్‌టుడే, లక్కవరపుకోట, రేగిడి

బహుళ ప్రయోజన పరికరం

ఉపాధ్యాయినికి వచ్చిన ఆలోచనను ఆచరణలో పెట్టి జాతీయస్థాయిలో ప్రశంసలు దక్కించుకుంది సంకిలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని భైరి హరిత. తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ బాలిక బహుళ ప్రయోజన పరికరాన్ని తయారు చేసింది. భౌతికశాస్త్ర ఉపాధ్యాయిని కె.ప్రవీణాలత సహకారంతో పాత ఇనుప పరికరాలతో రూ.1000 ఖర్చుతో రూపొందించి. దీనిని సుత్తి, గొడ్డలి, రెంచీ, స్క్రూడ్రైవర్ తదితరాలుగా వినియోగించుకోవచ్చు. రాష్ట్రస్థాయిలో కడప జిల్లాలో 2019లో ప్రదర్శించామని, ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రశంసలు దక్కాయని హరిత చెబుతోంది. గతంలో బహుళ వినియోగ వ్యవసాయ పరికరం, ఆపరేషన్ బెడ్ వంటి ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి వెళ్లాయని గుర్తు చేసింది.





దేశ రాజధానిలో జరిగిన పోటీల్లో ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న హరిత

గిరిజన గూడేల్లోకి గజరాజులు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలంలోకి ప్రవేశించిన ఏనుగులు గిరిజన గూడేల్లోకి వెళ్లి పంటలు, తోటలను ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం సీతంపేట మార్గంలో ఆరు ఎకరాలకు పైగా పంటలను తొక్కేశాయి. తర్వాత సమీపంలోని పామాయిల్ తోటలో తిష్ఠవేశాయి. తొలిసారి ఈ గ్రామాల వైపు గజరాజులు రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కోరి, పనసభద్ర, తొక్కుడువలస, తాన్నవలస, సీతంపేట, రంగలగూడ మధ్య సంచరిస్తుండటంతో ఎవరూ బయటకు వెళ్లేందుకు సాహసించడం లేదు. రేంజర్ మణికంఠేష్ నేతృత్వంలో ట్రాకర్లు పర్యవేక్షిస్తున్నారు.



సీతంపేట మార్గంలో దెబ్బతిన్న వరి

> నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి రింగురోడ్డు సమీపంలోని మాంసం దుకాణానికి వెళ్లి మూడు కిలోలు కొన్నారు. తూకం తేడా కనిపించడంతో పక్కనే ఉన్న మరో దుకాణానికి వెళ్లగా.. రెండున్నర కిలోలే వచ్చింది. తిరిగి వెళ్లి అడిగితే దుకాణ యజమాని వాగ్వాదానికి దిగాడు.

> నగరానికి చెందిన ఓ వ్యక్తి లీటరు పాల ప్యాకెట్లను రెండు కొన్నారు. ముద్రించిన ధర కన్నా అదనంగా రూ.4 తీసుకున్నారు. ప్రశ్నించగా.. అలా అమ్మితేనే తమకు గిట్టుబాటు అవుతుందని వ్యాపారుస్థుడు చెప్పుకొచ్చాడు. బొబ్బిలి, గంట్యాడలోనూ అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

అడిగినంత కాదు.. ఇచ్చినంత తీసుకోండి

- తూకాల్లో తేడాలపై పెద్దఎత్తున కేసులు
- తనిఖీలు అంతంత మాత్రమే



తూకపు రాళ్ల బరువులు చూస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

ఉమ్మడి జిల్లాలో నిత్యం మార్కెట్లో వినియోగదారులకు ఎదురవుతున్న సమస్యలివి. తూకాల్లో లోపాలు, అధిక ధరలకు అమ్మకాలతో ఫిర్యాదులు పెరుగుతున్నాయి. చిన్నపాటి దుకాణాల నుంచి పెద్దపెద్ద మార్టుల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరు అధికారులకు ఫిర్యాదు చేస్తుండగా.. మరికొందరు తమకెందుకని మిన్నకుండిపోతున్నారు. ఈక్రమంలో అక్రమాలు పెరుగుతునాయి.

ఇవి చూడాల్సిందే.. ● తూకాన్ని తప్పనిసరిగా గమనించాలి ● బిల్లు తీసుకోవాలి ● దానిపై ఉన్న ధరకు.. వస్తువుపై ఉన్నదానిని సరిపోల్చాలి ● ఇంటికి వెళ్లి సరకు నాణ్యతను చూసుకోవాలి ● తయారీ, వినియోగపు తేదీ ఉన్న వాటినే కొనాలి ● తూనికల అడుగు భాగాన లీగల్ మెట్రాలజీ అధికారుల ముద్ర పరిశీలన తప్పనిసరి

సిబ్బంది కొరత..


వాస్తవానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యాపార సముదాయాలకు తగ్గట్టుగా తూనికల కొలతల శాఖలో సిబ్బంది లేరు. కేవలం ఇన్‌స్పెక్టర్లతోనే నెట్టుకొస్తున్నారు. ఆకస్మిక తనిఖీలకు వెళ్లేటప్పుడు సంబంధిత వ్యాపారస్థుల నుంచి ప్రతిఘటన ఎదురైతే ఎదుర్కొనే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ప్రస్తుతానికి రెండు జిల్లాల పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఒక జిల్లా అధికారి ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది పది మంది కూడా లేరు.

ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు

జిల్లా	కేసులు	జరిమానాలు(రూ.లక్షల్లో) ముద్రణ	అపరాధ
విజయనగరం	91	16.26	6.53
పార్వతీపురం మన్యం	23	3.75	1.30

సంప్రదించాల్సిన చరవాణి నంబర్లు

అసిస్టెంటు కంట్రోలర్	: 99516 86789
విజయనగరం ఇన్‌స్పెక్టర్	: 90008 28467
బొబ్బిలి ఇన్‌స్పెక్టర్	: 93981 31790
పార్వతీపురం మన్యం	: 94419 62429
టోల్ ఫ్రీ నంబరు	: 18004254202



తనిఖీలు ఇలా.. తూకం రాళ్లు, ఎలక్ట్రానిక్ కాటాలకు సీళ్లు వేయడం, ప్యాకెట్లు, సీసాలపై ముద్రించిన ధరలకు విక్రయించేలా చూడటం, వివరాలు, చిరునామా కనిపించకపోతే జరిమానాలు విధించడం

అప్రమత్తత అవసరం..

వినియోగదారులు అప్రమత్తంగా ఉంటే మోసాలను అరికట్టవచ్చు. ఎలాంటి లోపాలు కనిపించినా మా దృష్టికి తీసుకురావొచ్చు. సిబ్బంది తక్కువగా ఉన్నా విధి నిర్వహణలో రాజీ పడడం లేదు. తరచూ దాడులు చేస్తున్నాం. పెద్దఎత్తున కేసులు నమోదు చేస్తున్నాం.

– రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్, తూనికలు– కొలతల శాఖ, విజయనగరం

మన్యంలో మండలానికో ఆదర్శ వన్‌దన్ కేంద్రం

పార్వతీపురం, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలో మండలానికి ఒక వనదన్ వికాస కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది, గిరిజన ప్రగతికి నమూనాగా నిలిచేలా చేయాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ సూచించారు. శుక్రవారం వీడీవీకేల పనితీరుపై ఐటీడీఏ ఏపీవోలు, డీఆర్‌డీఏ పీడీలతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. గిరిజనులు సేకరించే ఉత్పత్తులకు విలువ జోడించి, వినియోగదారులను ఆకర్షించే స్థాయిలో మార్కెటింగ్ చేయించాలన్నారు. సమావేశంలో సీతంపేట, పార్వతీపురం ఏపీవోలు చినబాబు, మురళీధర్, పీడీ సత్యంనాయుడు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

స్వచ్ఛమైన నెయ్యి కొనుగోలు చేయాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: తితిదే నేరుగా రైతుల నుంచి స్వచ్ఛమైన నెయ్యి కొనుగోలు చేయాలని సుభాష్ పాలేకర్ కృషి(ఎస్‌పీకే) విధాన సాధకుడు విజయరాయ్ కోరారు. శుక్రవారం బొబ్బిలిలో జరిగిన యువ రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. 35 లీటర్ల పాలకు కిలో నెయ్యి వస్తుందని, ఈ లెక్కన కిలో రూ.2 వేలు పడుతోందని చెప్పారు. తితిదే రూ.500, మిగిలిన రూ.1500 సీఎస్‌ఆర్ నిధి కింద భరిస్తే అన్నదాతకు లబ్ధి కలుగుతుందన్నారు. విదేశాల్లో స్థిరపడ్డ చాలామంది గోవులు కొనుగోలుకు కావాల్సిన నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారని, జిల్లాల వారీ ప్రవాసాంధ్రులను గుర్తించి ఆ ప్రాంత రైతులకు గోవులు సమకూరేలా చూడాలన్నారు. ఇలా అయితే రాష్ట్రంలో 5 వేల గోవులు సమకూరుతాయని, రోజుకు మూడు టన్నుల నెయ్యి సరఫరా చేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో గోవుల సంరక్షణ శాలల నిర్మాణానికి 10 ఎకరాల స్థలం సేకరించే పనిలో ఉన్నామన్నారు. ఎమ్మెల్యే బేబీనాయన స్థల సేకరణకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.



మాట్లాడుతున్న విజయరాయ్

చేయూత కార్యక్రమం అభినందనీయం

నేరవార్తా విభాగం: పోలీసు శాఖలో పనిచేసి మరణించిన వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు తోటి ఉద్యోగులు ప్రారంభించిన 'చేయూత' కార్యక్రమం ఎంతో గొప్పదని, అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. రేగిడి ఆమదాలవలస పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన పి.నారాయణరావు ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించారు. వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు 'చేయూత' కింద పోలీసు సిబ్బంది పోగుచేసిన రూ.1,49,000ను చెక్కు రూపంలో ఆయన సతీమణి పి.పార్వతమ్మకు శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు. పోలీసు కార్యాలయ సూపరింటెండెంటు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పంచాయతీ అధికారి బాధ్యతల స్వీకరణ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారిగా టి.వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లాలో డీపీవోగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ జడ్పీ సీఈవోగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటేశ్వరరావు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

మేమేం చేశాము.. పాపం

చిన్నారులకు విషమిచ్చిన తల్లి

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబంలో తలెత్తిన వివాదాలు అభంశుభం తెలియని చిన్నారుల పాలిట శాపంగా మారాయి. తల్లిదండ్రుల మధ్య మనస్పర్థలు పిల్లల ప్రాణాల మీదకు వచ్చాయి. కురుపాం మండలంలో జరిగిన ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. కురుపాం మండలం లంకాజోడుకు చెందిన బిడ్డిక రమేష్, రమ్య ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఆర్యన్ (5), ఆరోహి (6 నెలలు) ఇద్దరు పిల్లలున్నారు. చిన్నారుల తల్లి రమ్య వివరాల మేరకు.. రమేష్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. తన సోదరితో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో నిలదీశానని, ఆరు నెలలుగా గొడవలు జరుగుతున్నాయని తెలిపింది. చనిపోవాలని నిర్ణయించుకొని ఇద్దరు పిల్లలకి పురుగు మందు ఇచ్చానని, తాను తాగేలోపు కుటుంబ సభ్యులు చూసి అడ్డుకున్నారని వాపోయింది. అస్వస్థతకు గురైన చిన్నారులను భద్రగిరి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. మెరుగైన వైద్యసేవల కోసం పార్వతీపురం తరలించారు. రమ్య మానసిక పరిస్థితి బాగోలేదని భర్త రమేష్ తెలిపాడు.

రూ.62 కోట్లతో జల్‌జీవన్ పనులు

భామిని, న్యూస్‌టుడే: మండలంలో రూ.62 కోట్లతో చేపడుతున్న జల్‌జీవన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూధనరావు శుక్రవారం పరిశీలించారు. ఏబీ రహదారి పక్కన నుంచి పైపులైన్లు వేశారు. నేరడి(బి) గ్రామం వద్ద రక్షిత పథకం పనులు ప్రారంభించామని ఏఈ సందీప్ వివరించారు. బురుజోల కొండ వద్ద మెగా రక్షిత పథకం, గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణానికి స్థలాల సేకరణకు సమస్యలున్నాయని, నోటీసులు ఇచ్చామని తహసీల్దార్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడి మృతి

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఓ పురోహితుడు మృతి చెందిన ఘటన గరుగుబిల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేష్‌నాయుడు వివరాల మేరకు.. జియ్యమ్మవలస మండలంలోని తుంబలివలసకు చెందిన పురోహితుడు ఎం.బాలభాస్కరశర్మ(58) ద్విచక్రవాహనం, చినమేరంగి వైపు వెళ్తున్న కారు తోటపల్లి దేవస్థానం సమీపంలోని కర్రల డిపో వద్ద ఢీకొన్నాయి. ఈ క్రమంలో బాలభాస్కరశర్మకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



బాలభాస్కరశర్మ (పాతచిత్రం)

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

బెలగాం, జియ్యమ్మవలస న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంటు సెషన్ జడ్జి ఎస్.అరుణ తీర్పునిచ్చారు. ఎస్సై అనీష్ వివరాల మేరకు 2019లో వ్యక్తిగత కక్షలతో పెదమేరంగి కూడలి వద్ద పి.ధర్మారావుపై అదే గ్రామానికి చెందిన బి.లోకనాథం దాడి చేసి గాయపరిచాడు. కేసు నమోదు చేసి చినమేరంగి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం లోకనాథంకు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై చెప్పారు.

కోనేరులో జారిపడి వృద్ధురాలి మృత్యువాత

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మంచినీటి కోనేరులో ప్రమాదవశాత్తు జారిపడి ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన గంట్యాడ మండలం బుడతనాపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జి.నాగమ్మ(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె సాయంత్రం వరకు తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం సమీపంలోని కోనేరులో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

రాజాం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి.. కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజాం మండలంలో జరిగింది. సీఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒమ్మి గ్రామానికి చెందిన సీహెచ్.తిరుపతిరావు(45) కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మందు కొనుగోలుకు ఇంట్లో డబ్బులు ఇవ్వకపోవడంతో ఈనెల 3న పొలంలో గడ్డిమందు తాగి ఇంటికి వచ్చాడు. వాంతులు కావడం, అంతలోనే అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం పరిస్థితి విషమించడంతో వైద్యులు సూచనల మేరకు శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశాడు. అతని భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఏఎస్సై జనార్దనరావు దర్యాప్తు చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు.

మెప్మా బజార్లు వచ్చేశాయ్



మెప్మా బజారు సందర్శిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నగరపాలక సంస్థ కమిషనరు నల్లనయ్య తదితరులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయడమే కాకుండా వారు ఆర్థికంగా ముందడుగు వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మెప్మా అర్బన్ బజార్ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. విజయనగరం జిల్లా కేంద్రంలో గురువారం ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కమిషనరు నల్లనయ్య, మెప్మా అధికారులతో కలిసి ప్రారంభించారు. తొలిరోజు రూ.1.50 లక్షల విలువైన ఉత్పత్తులను అమ్మినట్లు ప్రకటించారు. ఇక నుంచి నెలలో రెండు రోజుల పాటు అందుబాటులో ఉండనున్నాయని పేర్కొన్నారు.



స్టాళ్ల వద్ద మహిళలు

> **మంచి అవకాశం..** నెలలో రెండు సార్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ప్రారంభించాం. ఇకనుంచి వివిధ ప్రాంతాల్లో పెట్టనున్నాం. బ్యాంకుల నుంచి ఒక్కో సంఘం రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకోవచ్చు. ఈ విధానంతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కానున్నారు.
>
> – పి.నల్లనయ్య, కమిషనరు, నగర పాలక సంస్థ

అవకాశాలివీ..

నగరపాలిక పరిధిలో 5,386 సంఘాల్లో 56,090 మంది సభ్యులున్నారు. ఈ బజార్లలో స్టాళ్ల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి వీరికి రుణాలు అందజేస్తున్నారు. అల్పాహారం, కిరాణా, డెయిరీ ఉత్పత్తులు, కూరగాయలు, వివిధ రకాల ఆహార పదార్థాలు, పచ్చళ్లు, దుస్తులు, రెడీమేడ్ ఆభరణాలు, చేతివృత్తులకు సంబంధించిన పరికరాలు తదితరాలను ఇక్కడ అమ్ముకోవచ్చు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ బజార్లను పెద్దఎత్తున నడిపించేవారు. అయితే వైకాపా వచ్చాక అన్నింటినీ ఆపేయడం గమనార్హం. కూటమి రాకతో పునరుద్ధరిస్తున్నారు.

ప్రజా దర్బార్‌లో 162 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణం పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొయిపాకలో శుక్రవారం అర్జీలు స్వీకరించారు. సమీప గ్రామాల నుంచి పెద్దఎత్తున వచ్చి 162 మంది వినతులు అందజేశారు. రస్తాబడి గ్రామంలో రహదారి, చెక్‌డ్యాం, అంగన్‌వాడీ భవనం నిర్మించాలని, జర్న నుంచి కెల్లుకు రహదారి, కుంతేసు గ్రామంలోకి వర్షం నీరు రాకుండా రక్షణ గోడ, ఎస్సీ గొయిపాకలో ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మించాలని, ఇరిడిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, పింఛన్లు, ఇళ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పి. సుదర్శనరావు, సర్పంచి లక్ష్మి, నాయకులు సుందరరావు, పెంటారావు, భాస్కరరావు, రమేష్, శరత్, హనీస్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థతో రాష్ట్రాభివృద్ధి



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. మండలంలోని రూ.1.70 కోట్లు ఉపాధి నిధులతో నిర్మించిన చిట్టపులివలస, యు.వెంకంపేట రహదారులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రవాణా వ్యవస్థ బాగుంటేనే అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని, మరో వైపు ప్రమాదాలు నివారించొచ్చని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు క్రమంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ఈఈ సింహాచలం, ఏఈ కె.నాగభూషణరావు, తోటపల్లి ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ పాండురంగ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తినాయుడు, మండలాధ్యక్షుడు ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రజలకు పాలన చేరువ చేస్తాం



సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పాలన మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెదంకలాంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం భవనాలను ప్రారంభించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచి బి.శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ డీఈ రత్నకుమార్, నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ❖ కలెక్టరేట్ ప్రాంగణం: అన్ని గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు నడుపుతామని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కొత్త బస్సును ప్రారంభించారు. డిపో ప్రబంధకులు దుర్గ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	-8008566244
పాలకొండ	-8008574299
సాలూరు	-8008786820
కురుపాం	-9849044696

? తులసివలసలో విద్యుత్తు నియంత్రిక సరిగా పనిచేయక గృహ ఉపకరణాలు దెబ్బ తింటున్నాయి. - **రాములు, గ్రామస్థుడు**

❖ తులసివలసలో కొత్త నియంత్రిక ఏర్పాటు చేస్తాం. - **వెంకటరమణ, విద్యుత్తు ఏఈ** - న్యూస్‌టుడే, కొమరాడ

? సీతానగరంలోని పెదపోగిల కాలనీ నుంచి సాలా వారి వీధి వరకు పక్కా కాలువ లేదు. మురుగు రోడ్డుపై పారుతోంది. - **రామకృష్ణ**

❖ కాలువ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభిస్తాం. - **రమేష్, ఈవో, పెదపోగిల** - న్యూస్‌టుడే, సీతానగరం

? పాలకొండ రామకూనమండల్ వీధి రహదారి గోతులమయంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **రమేష్, ఉద్యోగి**

❖ కొత్త రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - **స్వాతి, నగర పంచాయతీ ఏఈ** - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

విధుల్లోకి వీఆర్వోలు

జియ్యమ్మవలస: పలువురు వీఆర్వోలు శుక్రవారం విధుల్లో చేరారు. జి.సురేష్ కుమార్ (పరజపాడు), వై.భాస్కరరావు (కుదమ), ఎల్‌వీకే నాయుడు (అలమండ) బాధ్యతలు స్వీకరించినట్లు డీటీ పకీరు తెలిపారు.

పెద్దాసుపత్రిలో.. సమస్యల బేజారు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన ప్రజలకు గుండెకాయ లాంటి జిల్లా ఆసుపత్రి విభాగాలు కొన్ని సేవలకు దూరం అవుతున్నాయి. ఇక్కడ సరిపడా సిబ్బంది, సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. ప్రాంతీయ ఆసుపత్రిగా ఉన్న సమయంలోని కొన్ని పోస్టులు రద్దు కావడంతో ఇప్పుడు అవస్థలు ఎదురవుతున్నాయి.

మందుల పంపిణీ ఇబ్బందులు..

పార్వతీపురం మన్యం జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత ప్రాంతీయాసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా ఉన్నతీకరించారు. ఒకప్పుడు 100గా ఉన్న పడకలు 150 చేశారు. అదనపు విభాగాలను ఏర్పాటు చేశారు. సేవలు పెంచారు. ఇక్కడ నుంచి జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రులు, సీహెచ్‌సీలకు మందుల సరఫరా చేయాల్సి ఉంటుంది.

ముగ్గురే సిబ్బంది..

ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు, ఓపీ విభాగం సేవల లక్ష్యాలు పెంచారు. డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేశారు. కానీ సిబ్బందిని నియమించలేదు. ఆసుపత్రికి అవసరమైన, చికిత్సలకు మందులు అందించడంతో పాటు ఇతర ఆసుపత్రులకు సరఫరా చేసేందుకు సిబ్బంది అవసరం ఉంటుంది. ఇవన్నీ ప్రస్తుతం ముగ్గురు మాత్రమే చేస్తున్నారు. ఒక పోస్టు ఖాళీగా ఉంది. మరికొంత మంది సిబ్బంది అవసరం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.



జిల్లా ఆసుపత్రిలో నిల్వ ఉన్న మందులు

రోగులకు ఇబ్బందులు..

ప్రాంతీయాసుపత్రిగా ఉన్నప్పుడు పార్వతీపురంలో ఎలక్ట్రీషియన్, ప్లంబరు పోస్టులుండేవి. ఎక్కడ సమస్య వచ్చినా వారు పనులు చేసేవారు. ప్రస్తుతం ఆ పోస్టులు రద్దయ్యాయి. ఇన్ పేషెంట్లు నిత్యం 250 మంది ఉంటున్నారు. పంకాలు తిరగాలి. నీరు అందాలి. కానీ తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. రోగులు తీవ్ర ఇబ్బందులు పడితే బయట నుంచి వచ్చి పనులు చేస్తున్నారు.

పోస్టులు మంజూరు లేదు..

జిల్లాలో పాలకొండ, సీతంపేట, సాలూరులో ప్రాంతీయాసుపత్రులు ఉన్నాయి. కురుపాం, భద్రగిరి చినమేరంగిలో సీహెచ్‌సీలు నడుస్తున్నాయి. ఈ ఆరింటికీ కావాల్సిన మందులు గతంలో విజయనగరం నుంచి వచ్చేవి. జిల్లా ఆసుపత్రిగా మారిన తర్వాత ఇక్కడి నుంచే పంపిస్తున్నారు. ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఫార్మసిస్టు గ్రేడ్2 ముగ్గురు, గ్రేడ్1 ఒకరు, ఫార్మసిస్టు సూపర్‌వైజర్ ఒకరు చొప్పున ఉన్నారు. జిల్లా ఆసుపత్రిలో మాత్రం గ్రేడ్-2 ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. గ్రేడ్-1పోస్టు ఖాళీగా ఉంది. ఫార్మసిస్టు సూపర్ వైజర్ పోస్టు మంజూరు కాలేదు. చిన్న ఆసుపత్రులకు పోస్టు ఇచ్చి, పెద్దాసుపత్రికి ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉంది.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..

డ్రగ్ సెంటర్‌లో ఫార్మసిస్టు పోస్టు ఖాళీగా ఉంది. సూపర్‌వైజర్, ప్లంబరు, ఎలక్ట్రీషియన్ పోస్టులు మంజూరు కాలేదు. ఎక్కడైనా సమస్యలుంటే బయట నుంచి వచ్చి పనులు చేస్తున్నారు. ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. - వాగ్దేవి, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు

ఆసుపత్రిలో పరిస్థితి.. ఆసుపత్రి: పార్వతీపురం జిల్లా ఆసుపత్రి పరిధి: 15 మండలాలు పడకలు: 150 రోజూవారీ ఓపీ: 500నుంచి 600వరకు ఇన్‌పేషెంట్లు: 250 నుంచి 380 సమస్య: సరిపడా సిబ్బంది లేమి

పాఠశాలకు గేటు ఏర్పాటు



కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మొండెంఖల్ ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనుల్లో భాగంగా గదులకు మరమ్మతులు చేసి ప్రహరీ గోడ, రక్షణ గోడ నిర్మించారు. కానీ గేటు ఏర్పాటు చేయకపోవడంతో ఆవరణలోకి పశువులు వెళ్లేవి. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల 'గేటు లేక అవస్థలు' శీర్షికతో చిత్రవార్త 'ఈనాడు'లో ప్రచురించారు. ఉపాధ్యాయులు స్పందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో గేటు ఏర్పాటు చేశారు.

స్పందనకు వందనం

నోటీసుల జారీ

పార్వతీపురం గ్రామీణం: పార్వతీపురం-బొబ్బిలి రహదారిలో ఆఫీసర్స్ కాలనీ ఎదురుగా రహదారిపై బ్యానరు ఏర్పాటు చేసిన వారికి అధికారులు నోటీసులు ఇచ్చారు. రహదారిని ఆనుకొని బ్యానరు ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఈనెల 1న 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు తెలిపారు. ర.భ.శాఖ డీఈఈ అప్పాజీ, ఏఈ రాజేంద్ర స్పందించి.. బ్యానరు తొలగించాలని నోటీసులిచ్చారు.

బోరు ప్లాట్‌ఫాం నిర్మాణం

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కిరంపురంలోని బోరు చుట్టూ ప్లాట్‌ఫాం నిర్మించారు. ఇక్కడ మురుగు నిలిచి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండేవి. దీంతో మహిళలు అవస్థలు పడేవారు. దీనిపై ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురితమవగా పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్ స్పందించారు. సర్పంచి ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్లాట్‌ఫారాలు బాగు చేశారు.



విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన స్వాగతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థి దశలో చదువుపై దృష్టిసారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రధానాచార్యులు డా.ఎస్.శ్యాంబాబ్‌ను అభినందించారు. వైద్యురాలు ఆర్. భారతి, ప్రతినిధులు కె.రవిరాజ్, ఉప ప్రధానాచార్యులు డా.జయమణి, విశ్రాంత గ్రంథాలయాధికారి చౌదరినాయుడు, ఎస్.సుధాకర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



దుర్గాప్రసాద్ పాడిని సన్మానిస్తున్న సభ్యులు

భామిని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బత్తిలికి చెందిన ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాడిని ఏపీ, ఒడియా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో మూడు సార్లు ఉత్తమ అవార్డు అందుకోవడం దుర్గాప్రసాద్ పాడి పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. సంఘ ప్రతినిధులు, ఎం.ప్రఫుల్‌కుమార్, జ్ఞానేశ్వర్ గౌడ్, భానుప్రసాద్ సాహు, వి.రామకృష్ణ, సుశీల, బలరాం, రఘునాథ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

53 మందికి ఉపాధి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. 4 కంపెనీల్లో ఉద్యోగాలకు 53 మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. మొత్తం 273 మంది హాజరైనట్లు చెప్పారు. ఎంపికైన వారు పార్వతీపురం, విశాఖపట్నం, హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందన్నారు.



మేళాకు హాజరైన యువత

ఇసుక ఉచితంగా అందించాలి



ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు, కార్మికులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానం అమలు చేసి కార్మికులకు ఆర్థిక ఆసరా కల్పించాలని సీపీఎం, సిటు నాయకులు ఆర్.వేణు, వై.మన్మథరావు డిమాండు చేశారు. ఉచిత ఇసుక పాలసీపై పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడుకు వినతిపత్రం అందించారు. నాయకులు బి.దాసు, జి.వెంకటరమణ, కె.సాంబమూర్తి, దిలీప్ తదితరలు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సమష్టిగా పనిచేయాలి

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణాభివృద్ధికి పురపాలక అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది సమష్టిగా పని చేయాలని కమిషనరు కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన బదిలీపై వెళుతున్న సందర్భంగా అధికారులతో సమావేశమయ్యారు. అందరి సహకారంతో ఎన్నికలతో పాటు అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ఆయన నుంచి ఇన్‌ఛార్జి కమిషనరుగా ఏఈ సన్యాసిరావు బాధ్యతలు స్వీకరించారు. ప్రబంధకులు జి.లక్ష్మి, ఆర్వో రూబిన్, ఏఈ ఆనంద్, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో సమావేశమైన కమిషనరు శ్రీనివాస్

మహాసభల విజయవంతానికి పిలుపు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరగనున్న ఏపీటీఎఫ్ 80 ఏళ్ల వేడుకలు, విద్యా, వైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పి.కూర్మినాయుడు కోరారు. విద్యా ప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం, సమాజ శ్రేయస్సు, మహిళా సాధికారత, పింఛను, నూతన విద్య, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై చర్చలు ఉంటాయన్నారు. విద్యావంతులు, ఉపాధ్యాయులు నిరుద్యోగులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

తెగుళ్ల నివారణకు చర్యలు

కురుపాం గ్రామీణం, జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: వరి, పత్తి పంటలు తెగుళ్ల బారిన పడితే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్తలు డా.స్రవంతి, అనంతవిహారి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జియ్యమ్మవలస, తుంబలి, చిలకాంలో పర్యటించారు. వరి, పత్తి, అరటి పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.


గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా నోడల్ అధికారి ఎం.వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గవరమ్మపేట, చినమేరంగిలో ఇంటింటికీ వెళ్లి గర్భిణుల ఆరోగ్య పరిస్థితి పరిశీలించారు. పోషకాహారం అందించి రక్తహీనత లేకుండా చూడాలన్నారు. జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యుడు జగదీష్, పర్యవేక్షకుడు శ్రీనివాసరావు ఉన్నారు.

వేడుకగా నవరాత్రి ఉత్సవాలు

దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రతిష్ఠించిన దుర్గమ్మకు పూజలు చేశారు. కురుపాం మండలం రావాడ కూడలి వద్ద కొలువైన శ్రీ కోట దుర్గమ్మ బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ★ పార్వతీపురం మండలంలోని ఎమ్మార్‌నగరంలో కోటదుర్గ ఆలయంలో గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, బృందం



అలంకరణలో సాలూరు కామాక్షి



బలిజిపేట మండలంలోని అజ్జాడలో..



పార్వతీపురం గూడ్స్ షెడ్డు రహదారిలో..



గుమ్మలక్ష్మీపురంలో పూజలు చేస్తున్న భక్తులు



అర్తాంలో సామూహిక పూజలు



సాలూరు మోటారు కార్మికులు ఏర్పాటు చేసిన దుర్గాదేవి

వృద్ధుడి అదృశ్యం

సాలూరు గ్రామీణం: దుగ్ధసాగరం గ్రామానికి చెందిన చిట్లి సూర్యనారాయణ(70) ఈ నెల 2న ఇంటి నుంచి వెళ్లి రాలేదు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 91778 51421 సమాచారం ఇవ్వాలన్నారు.

యువకుడికి గాయాలు

భామిని: నల్లరాయిగూడకు చెందిన బి.జోనేష్ ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా ఘనసర సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్రగాయాలైన బాధితుడిని 108 వాహనంలో శ్రీకాకుళం తరలించారు. కేసు నమోదు చేసినట్లు బత్తిలి పోలీసులు తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

పాచిపెంట: మరణాలు పునరావృతం కాకుండా చూడాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర అన్నారు. విశ్వనాథపురంలో అతిసారం బారిన పడిన వారిని కలిసి మాట్లాడారు. మృతి చెందిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండు చేశారు.

రహదారుల పరిశీలన

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలో మంజూరైన ఆరు బీటీ రహదారులను పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. ద్రాక్షిణి గ్రామానికి రూ.1.40 కోట్లు, కుదమ నుంచి గదబవలసకు రూ.1.20 కోట్లు, లోతువానివలసకు రూ.80 లక్షలు, డంగబద్రవలసకు రూ.1.30 కోట్లు, వెంకటరాజుపురానికి రూ.19 లక్షలు, బాసంగి గదబవలసకు రూ.26 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. డీఈఈ జి.శ్రీనివాసరావు, ఏఈ పార్థసాయి, సచివాలయ ఇంజినీరింగు సహాయకులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టరుకు ఫిర్యాదు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ మండలంలో పీఆర్ రాజుపేటలోని 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నర్సింహచెరువు అభివృద్ధికి వెచ్చించిన నిధులు వృథా అయ్యాయని అభ్యుదయ రైతు కె.ప్రసాదరావు సబ్‌కలెక్టరు సి.యశ్వంత్‌రెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు.



పార్వతీపురం పట్టణంలోని శ్రీ విద్యా సర్వమంగళ పీఠాన్ని హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు దర్శించుకున్నారు. శుక్రవారం మండపంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి పీఠం నిర్వాహకులు ఎం.కాళిదాసు శర్మ పూజలు చేయించారు. - **పార్వతీపురం పురపాలిక**

అటవీశాఖ రేంజ్ అధికారిగా రాంనరేష్

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం అటవీశాఖ రేంజ్ అధికారిగా బి.రాంనరేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు రేంజర్ వీవీఎస్ఎన్.రాజు, ఫారెస్టర్ మనోజ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఇక్కడ విధులు నిర్వహించిన రాజు విజయనగరం సామాజిక అటవీ రేంజర్‌గా వెళ్లారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న అటవీశాఖ అధికారులు

బాధ్యతల స్వీకరణ

కురుపాం గ్రామీణం, సీతానగరం, న్యూస్‌టుడే: కురుపాం ఎంపీడీవోగా జె.ఉమామహేశ్వరి, సీతానగరం ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, వీరఘట్టం ఎంపీడీవో బెందాళం వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ★ **గరుగుబిల్లి, పార్వతీపురం గ్రామీణం:** గరుగుబిల్లి తహసీల్దారు, పి.బాల, పార్వతీపురం తహసీల్దారు వై.జయలక్ష్మి, ఉప తహసీల్దారు పి.కిరీటి బాధ్యతలు స్వీకరించారు.

తెదేపాలోకి వైకాపా నాయకులు



భూదేవితో పార్టీలో చేరిన నాయకులు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణంలోని పాత ఆంధ్ర బ్యాంకు ఎదురుగా తెదేపా కొత్త కార్యాలయాన్ని శుక్రవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండేలా కార్యాలయం ఏర్పాటు చేశామని తెలిపారు. చలివేంద్రికి చెందిన వైకాపా ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకటనాయుడు, సర్పంచి ఎస్.సుదర్శనరావు, పలువురు కార్యకర్తలు, భాజపా మండలాధ్యక్షుడు డి.లక్ష్మణరావు తెదేపాలో చేరారు. మాజీ జడ్పీటీసీ ఎస్.దామోదరరావు, అరకు పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు వి.సుమంత్, నాయకులు కె.వెంకటరమణ, వి.ఈశ్వరరావు, జి.సింహాద్రి, ఎస్.సర్వారావు, గజేంద్రనాయుడు, ఎల్.మహేంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ దర్యాప్తు అధికారిగా హరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: హత్య కేసులో తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న సీఐ బి.హరి సేవలకు గుర్తింపు లభించింది. ప్రస్తుతం ఎల్విన్‌పేటలో సేవలు అందిస్తున్న సీఐ హరి గతంలో అనకాపల్లి జిల్లాలో పని చేశారు. మాకవరపాలెం, మునగపాక ఠాణాల పరిధిలో 2022, 2024లో జరిగిన మూడు హత్యలకు సంబంధించి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. దీనిలో భాగంగా ఉత్తమ దర్యాప్తు అధికారిగా ఏబీసీడీ అవార్డును విజయవాడలో డీజీపీ చేతుల మీదుగా అందుకున్నారు.



డీజీపీ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న సీఐ

వరద బాధితులకు రూ.25 వేలు



ఎమ్మెల్యేకు నగదు ఇస్తున్న మన్మథరావు

పార్వతీపురం గ్రామీణం, పురపాలిక, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు పార్వతీపురం పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి భోగి మన్మథరావు రూ.25 వేలు విరాళంగా ఇచ్చారు. ఎమ్మెల్యే విజయచంద్రకు శుక్రవారం నగదు అందజేశారు. ● మండలంలోని వెంకటరాయుడు పేట సర్పంచి దంపతులు సావిత్రి, వెంకటనాయుడు రూ.5 వేలు, భాస్కరరావు రూ.5 వేలు విరాళంగా ఎమ్మెల్యేకు అందజేశారు.

సీతంపేటలో ఎకో పార్కు

సీతంపేట, న్యూస్‌టుడే: సహజ పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ఎకో టూరిజం పార్కు ఏర్పాటుకు సీతంపేట ఐటీడీఏ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. శుక్రవారం హెచ్‌ఎన్‌టీసీ ఫారంలో కాటేజీలు నిర్మాణానికి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. అవకాశాలపై సిబ్బందితో చర్చించారు. ఐటీడీఏ శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించి, పోటీ పరీక్షలకు పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఏపీవో జి.చిన్నబాబు, పీహెచ్‌వో ఎస్.వి.గణేష్, ఉద్యాన శాఖ సబ్ అసిస్టెంట్ కె.కాంతారావు తదితరులున్నారు.



సూచనలు చేస్తున్న పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి